సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 5 । నవంబర్ । 2023



టికెట్ ఇస్తే జోరుగా..

అశ్వారావుపేట అభ్యర్థి ఎవరో తేలకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారంలో వెనుకపడుతున్నాయి.

10లో



కేసీఆరే మళ్లీ సీఎం..

కేసీఆర్‌ను మూడోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు.

10లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉండవచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భ గుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

10న జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 10న జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు కొత్తగూడెం సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి కనీసం ఒక్క ప్రాజెక్టు తప్పనిసరిగా ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం ప్రధాన అంశమని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఏదో ఒక ఉప అంశంలో మాత్రమే విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు రూపొందించాలని, ఇద్దరు విద్యార్థులు గైడ్ టీచర్ సహాయంతో సర్వే, పరిశీలనలు, ప్రశ్నావళి, కేస్ స్టడీస్ ఆధారంగా ప్రాజెక్టులు తయారు చేయాలని వివరించారు.

ఇల్లెందు బరిలో గుమ్మడి అనురాధ



గుమ్మడి అనురాధ

ఇల్లెందు: ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూతురు గుమ్మడి అనురాధ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగనున్నారు. స్వతంత్రంగా పోటీ చేసే అనురాధకు తమ పార్టీ మద్దతు ఉంటుందని శనివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రకటించారు. దీంతో ఐదుసార్లు ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నికైన గుమ్మడి నర్సయ్య ఈసారి పోటీ చేయటం లేదని తేలిపోయింది. కారేపల్లి మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన గుమ్మడి నర్సయ్య–అమ్మక్కల కుమార్తె ఉస్మానియా లా కళాశాల అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఆమె ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ పూర్తి చేశారు.

‘మూడు’ ఎలా ఉంటుందో..?

నేడు కాంగ్రెస్ ‘అసెంబ్లీ’ అభ్యర్థుల మూడో జాబితా

- సీపీఐకి కొత్తగూడెం నియోజకవర్గం కేటాయింపు ?
- ఇల్లెందు, అశ్వారావుపేట సెగ్మెంట్లపై ఉత్కంఠ
- చివరి నిమిషంలో చిక్కుల్లో సీపీఐ



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో మిగిలిన మూడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నేడు జాబితాను ప్రకటించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ మొదలైనా కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు, అశ్వారావుపేట, కొత్తగూడెం స్థానాలకు సంబంధించి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

కొత్తగూడెం సీపీఐకి..?

ఎన్నికల పొత్తులో భాగంగా కొత్తగూడెం సీటును సీపీఐకి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించి నెల రోజులు గడిచినా ఇప్పటికీ స్పష్టత రాలేదు. కొత్తగూడెంతోపాటు మరో సీటు ఇవ్వకుంటే కాంగ్రెస్‌తో కలిసి నడవబోమంటూ మరోవైపు సీపీఐ ప్రకటించింది. దీంతో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఉంటుందా లేదా అనే సందేహాలు నెలకొన్నాయి. అయితే సీపీఐ జాతీయ నాయకత్వం ఈ అంశంలో జోక్యం చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిరినట్టు గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. అందులో భాగంగా కొత్తగూడెం సీటును సీపీఐకే వదిలేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్టు సమాచారం. అయితే సీపీఐ విధించిన ఇతర షరతులపై ఇంకా స్పష్టత రాలేదు.

ఇల్లెందు, అశ్వారావుపేటలలో వీడని పీటముడి

ఇల్లెందు, అశ్వారావుపేట సీట్లపై పీటముడి ఇంకా వీడటం లేదు. ఇల్లెందు నుంచి టికెట్ ఆశిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. శనివారం నామినేషన్ కూడా దాఖలు చేశారు. అయితే ఈ సీటును బంజారా సామాజిక వర్గానికి కేటాయించాలనే డిమాండ్ బలంగా తెర మీదకు వచ్చింది. కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌తోపాటు శంకర్‌నాయక్, డాక్టర్ రవి, ప్రవీణ్‌నాయక్, చీమల వెంకటేశ్వర్లు తదితర నేతలు ఈ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రకటించబోయే మూడో జాబితాలో టికెట్ ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. అశ్వారావుపేట నుంచి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో పాటు జారే ఆదినారాయణ, సున్నం నాగమణిలు టికెట్ ఆశిస్తున్నారు. తమకే టికెట్ దక్కుతుందనే అంచనాల్లో వీరంతా నమ్మకాలు పెట్టుకున్నారు.

అజ్ఞాతంలోకి సీపీఐ కౌన్సిలర్లు!

చర్చోపచర్చల అనంతరం కాంగ్రెస్, సీపీఐల మధ్య ఎన్నికల పొత్తు విషయంలో సయోధ్య కుదిరిందనేలోగా మరో సమస్య ఆ పార్టీకి ఎదురైంది. కొత్తగూడెం మున్సిపాలిటీలో సీపీఐకి ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలర్లు ఇంకా పట్టు వీడలేదు. ఆ పార్టీకి మొత్తం ఎనిమిది మంది కౌన్సిలర్లు ఉండగా అందులో ఐదుగురు కౌన్సిలర్లు శనివారం ఉదయం నుంచి అజ్ఞాతంలోకి వెళ్లారు. ఫోన్లకు కూడా స్పందించడం లేదు. వీరంతా ఆదివారం కొత్తగూడెంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకుంటారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాన్ని ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు అధికారికంగా ధ్రువీకరించలేదు. మరోవైపు తప్పుడు ప్రచారమంటూ ఆ పార్టీ నేతలు కొట్టిపారేస్తున్నారు. కౌన్సిలర్లు అజ్ఞాతంలోకి వెళ్లారనే వార్తలు ప్రచారంలోకి రాగానే మరోసారి కాంగ్రెస్ నేతలు పొత్తులపై ఆసక్తికర కామెంట్లను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ పార్టీనే బరిలో ఉంటుందంటూ వారు ఆ పోస్టుల్లో పేర్కొంటున్నారు.

జంగ్ తెలంగాణ

సీఎం సభకు ఏర్పాట్లు పూర్తి

- నేడు కొత్తగూడెంలో ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ
- హాజరుకానున్న బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్
- పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు



ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత రాష్ట్ర సమితి అధినేత సీఎం కేసీఆర్ జిల్లాకు రెండోసారి నేడు రానున్నారు. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రకాశం స్టేడియంలో పార్టీ వర్గాలు ఘనంగా ఏర్పాట్లు చేశాయి.

ప్రకాశం స్టేడియంలో సభ..

ఓవైపు ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు సభ ఏర్పాట్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా తలమునకలై ఉన్నారు. ప్రజా ఆశీర్వాద సభ కోసం ప్రకాశం స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. ఎనభై వేలమందిని ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మధ్యాహ్నం సమయంలో సభ జరుగుతుండటంతో నీడ పడేలా స్టేడియం అంతా ఏర్పాట్లు చేశారు. ఎనిమిది ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. 150 మంది వలంటీర్లను నియమించారు. రెండు లక్షల మజ్జిగ, రెండుల లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. సీఎం కేసీఆర్ సభ నేపథ్యంలో ప్రకాశం స్టేడియం చుట్టూ మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలను పోలీసులు విధించారు. ప్రకాశం స్టేడియం వైపు వాహనాలు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు.

ప్రగతి మైదానంలో హెలిప్యాడ్..

ప్రగతి మైదానంలో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి సీఎం కేసీఆర్ వాయు మార్గం ద్వారా ప్రగతి మైదానం చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో సింగరేణి హెడ్ ఆఫీస్, మున్సిపల్ కార్యాలయం, పోస్టాఫీసు మీదుగా ప్రకాశం స్టేడియం చేరుకుంటారు. అక్కడ జిల్లాకు చెందిన నేతలు సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతారు. అనంతరం వేదికపైకి కేసీఆర్ చేరుకుంటారు. ప్రసంగం ముగిసిన తర్వాత హెలికాప్టర్‌లో ఖమ్మానికి బయల్దేరి వెళ్తారు.

వర్గపోరుపై కేసీఆర్ నజర్

గడిచిన రెండేళ్లుగా కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో వర్గపోరు కొనసాగుతోంది. పార్టీ కార్యక్రమాలు సైతం ఎవరికి వారుగా చేసుకుంటూ వచ్చారు. ఈ వర్గపోరు కారణంగా సిట్టింగ్ ఎమ్మెల్యే వనమాకు నియోజకవర్గంలో ఇబ్బందికర వాతావరణం ఉండేది. ఇంతలో ఎమ్మెల్యే వనమా ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు నమోదు చేసిన కేసులో తీర్పు వెలువడింది. వనమాకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఈ సమయంలో సీఎం కేసీఆర్ వనమాకు అండగా నిలబడ్డారు. రాబోయే ఎన్నికల్లో వనమా గెలుపు కోసం పని చేయాలంటూ పార్టీ శ్రేణులకు గట్టిగా చెప్పారు. దీంతో క్రమంగా నియోజకవర్గంలో ఉన్న వర్గపోరు తగ్గిపోయింది. అనూహ్యంగా పార్టీ తరఫున వనమా బీఫామ్ అందుకున్న తర్వాత మున్సిపాలిటీలో వర్గపోరు రాజుకుంది.

అసమ్మతిపై జిల్లా నేతల దృష్టి

గత రెండు వారాలుగా కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన కొందరు కౌన్సిలర్లు అసమ్మతి వర్గంగా ఏర్పడ్డారు. పార్టీ తరఫున ప్రచార కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వద్దిరాజు రవిచంద్ర అసమ్మతిని చల్లార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఎంతకీ కొలిక్కి రావడం లేదు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ సభ కొత్తగూడెంలో జరుగుతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ పార్టీకి చెందిన జిల్లా నేతలు అసమ్మతిపై దృష్టి పెట్టారు. గ్రూపులకు అతీతంగా గులాబీ శ్రేణులను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కేసీఆర్ సభకు ముందే అసమ్మతి అంతా చల్లారిపోతుందని భావన ఆ పార్టీ వర్గాల్లో నెలకొంది.

13న బూర్గంపాడు, దమ్మపేటలలో..

బూర్గంపాడు: ఈ నెల 13న జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన సభ బూర్గంపాడులో, అశ్వారావుపేట సభ దమ్మపేటలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీఎం సభలను విజయవంతం చేయాలని కోరారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక
- కలెక్టర్‌తో వ్యయ పరిశీలకుల భేటీ



జిల్లా ఎన్నికల అధికారితో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట పర్యవేక్షణ చేస్తున్నామని, వాహనాలను నిశిత పరిశీలన చేస్తూ నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల వివరించారు. కలెక్టర్‌తో శనివారం ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీబ్‌కుమార్ పాల్, అజయ్‌లాల్ చంద్‌లు కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. జిల్లాలోని పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలకు అజయ్‌లాల్ చంద్, కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సంజీబ్‌కుమార్ పాల్ వ్యయ పరిశీలకులుగా ఎన్నికల సంఘం నియమించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు కమిటీలను నియమించినట్లు తెలిపారు. సెన్సిటివ్ నియోజకవర్గాలైన ఇల్లెందు, కొత్తగూడెంలలో అదనపు సహా వ్యయ పరిశీలకులను, వీడియో వ్యూయింగ్ టీంలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఫిర్యాదులకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లా సరిహద్దుగా ఉన్న ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, ఇతర వస్తువులు రాకుండా చర్యలు తీసుకున్నామని, చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని అన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఖర్చులు పక్కాగా నమోదు చేయాలి

అభ్యర్థుల ఖర్చులు కచ్చితంగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయపరిశీలకులు సంజీబ్‌కుమార్ పాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందు నియోజకవర్గాల వ్యయ, ఎంసీఎంసీ, ఆబ్కారీ, ఆదాయపన్ను శాఖ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సి విషయాలను సోదాహరణంగా వివరించారు.

పెయిడ్ న్యూస్‌ను గుర్తించాలి

నిరంతర పర్యవేక్షణతో పెయిడ్ న్యూస్‌ను గుర్తించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీబ్‌కుమార్ పాల్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ వివిధ దినపత్రికలు, శాటిలైట్ చానల్స్, కేబుల్, సిటీ కేబుల్, సామాజిక మాధ్యమాల్లో అభ్యర్థుల ప్రచారాలను పరిశీలించాలని చెప్పారు. గుర్తించిన పెయిడ్ న్యూస్, ప్రకటనలపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ద్వారా అభ్యర్థులకు నోటీసులు జారీ చేయాలన్నారు. జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద కొనసాగుతున్న పర్యవేక్షణను, సీసీ కెమెరాల రికార్డింగ్ పనితీరును పరిశీలించారు. సీ విజిల్ వచ్చిన ఫిర్యాదులు వాటి పరిష్కారాలు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీముల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పినపాక రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్, వ్యయ నియంత్రణ నోడల్ అధికారులు వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, లైజన్ అధికారులు సంజీవరావు, సీతారాంనాయక్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దారా ప్రసాద్, ఎంసీఎంసీ నోడల్ అధికారి, డీపీఆర్వో ఎస్.శ్రీనివాసరావు, మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: ఎన్నికల వ్యయ పరిశీలకులు సంజీవ్‌కుమార్ పాల్, అజయ్ లాల్‌చంద్ సోనేజీ శనివారం ఇల్లెందులో పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంల అకౌంటింగ్ బృందాన్ని కలుసుకున్నారు.

రెండో రోజు ఏడు నామినేషన్లు దాఖలు



అశ్వారావుపేట: బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు తరఫున నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న దొడ్డా శ్రీరామమూర్తి

12లో

కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలి

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియాలో అమలు కానీ అనేక సంక్షేమ కార్యక్రమాలను సాధించిపెట్టిన కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. శనివారం రాత్రి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణను నేడు దొంగల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్మిక సమస్యలపై స్పందించే వనమా వెంకటేశ్వరరావును మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని, నేడు జరిగే ప్రజాఆశీర్వాద సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగెర్ల మల్లయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ బాదావత్ శాంతి, బీఆర్ఎస్ నాయకులు కోనేరు చిన్ని, జేవీఎస్ చౌదరి, టీబీజీకేఎస్ నాయకులు ఎండీ రజాక్, ఎం.సోమిరెడ్డి, కూసన వీరభద్రయ్య, కాపు కృష్ణ, చిలక రాజయ్య, సత్తార్‌పాష, ఎండీ గౌస్ పాల్గొన్నారు.

టికెటిస్తే జోరుగా ప్రచారం చేస్తాం..

- అభ్యర్థి ఎవరో తేలకపోవడంతో తర్జనభర్జనలు
- ప్రచారంలో వెనుకంజలో ప్రతిపక్షాలు



అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు బీఆర్ఎస్ బీ ఫామ్ ఇవ్వడంతో ప్రచారంలో జోరు పెంచారు. కొద్ది నెలలుగా కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీ కార్డుల పేరుతో నియోజకవర్గంలో పోటాపోటీగా ప్రచారం చేశారు. మారుమూల గ్రామాల్లో సైతం కాంగ్రెస్ పార్టీ వాణి వినిపించారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఆశావాహులు నాయకులు శ్రమించారు. కాంగ్రెస్ పార్టీ లో 2007 నుంచి క్రియాశీల కార్యకర్తగా మొదలుపెట్టి దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నామినేటెడ్ పదవి పొంది, ప్రస్తుత ముల్కలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్న సున్నం నాగమణి 2018లోనే కాంగ్రెస్ పార్టీ బీఫాం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. అప్పట్లో మహాకూటమి ఒప్పందంలో భాగంగా అశ్వారావుపేట సిగ్మెంట్ టీడీపీకి కేటాయించడంతో ఆమె నిరాశకు గురయ్యారు. కానీ, పార్టీ నిర్ణయం మేరకు మెచ్చా గెలుపుకు కృషి చేశారు. ప్రస్తుతం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆశీస్సులతో అశ్వారావుపేట టికెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ నుంచి బయటకొచ్చి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అశ్వారావుపేట తొలి ఎమ్మెల్యే వగ్గెల మిత్రసేన కుటుంబం నుంచి వచ్చి న వగ్గెల పూజ కూడా టికెట్ ఆశిస్తున్నారు. తాజాగా ఉమ్మడి ఖమ్మం జిల్లా కు చెందిన ముఖ్య నేతలు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయనతోపాటు జారే ఆదినారాయణ, తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆశావాహుల అంచనాలు తారుమారయ్యాయి.

టికెట్ కోసం ప్రదక్షిణలు..

కాంగ్రెస్ టికెట్ కోసం ఢిల్లీ మొదలుకుని పార్టీలోని సీనియర్లు, సబ్ జూనియర్ల చుట్టూ ప్రదక్షిణలు చేయడం మొదలు పెట్టారు. ఓవిధంగా చెప్పాలంటే కాంగ్రెస్ టికెట్ ఆశించే వారికంటే వారికోసం పట్టుపట్టే వారు ఢిల్లీలో ఉంటే సరిపోతుందట. కానీ. వారం రోజుల కిందటి వరకు జోరుగా ప్రచారం చేసిన ఆశావాహులు నియోజకవర్గంలో కనిపించడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత అధికార పార్టీ అభ్యర్థి ప్రచారం.. ప్రచారరథాలు చక్కర్లు కొడుతున్నా.. అప్పటిదాకా ఆరు గ్యారెంటీ కార్డులని.. చంటిపిల్లలను ఎత్తుకుని.. ముసలి వాళ్లతో ముచ్చటించి.. ఇలా పరుర కాల ప్రచార ఎత్తుగడను పాటించిన ఆశావాహులేమయినట్లని సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. 'మాకు టికెట్ ఇవ్వకున్నా ఫర్వాలేదు.. ఫలానా వ్యక్తికి మాత్రం ఇవ్వొద్దు' అని అధిష్టానం ఎదుట ఇద్దరు అన్నారని కొన్ని రోజుల కిందట ప్రచారం జరిగింది.

ఎవరికిచ్చినా పనిచేస్తారా?

'పార్టీ ఆదేశానుసారం టికెట్ ఎవరికిచ్చినా.. మేం పార్టీకే పనిచేస్తాం. అందరి సమన్వయంతో అశ్వారావుపేట స్థానాన్ని మొదట గెలుచుకుంటాం..' అని వేదికలపై ఉపన్యాసాలు చేసిన వారు ఇప్పుడు కనిపించడం లేదనే ప్రచారం నడుస్తోంది. నామినేషన్ దాఖలుకు ఆఖరి క్షణం వరకు తాను నమ్ముకున్న పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్తూ తనవంతు ప్రయత్నం చేస్తూనే ఆ తర్వాత రెబెల్, ఇండిపెండెట్లుగా బరిలో ఉండటం అన్నిచోట్లా సహజంగా జరిగేదే. కానీ, టికెట్ వస్తేనే ప్రచారంలోకి దిగుతాం. లేదంటే అప్పటిదాకా మిన్నకుంటాం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారా..? వారికి స్వప్రయోజనాలు తప్ప పార్టీ మనుగడ అవసరం లేదా..? హస్తం గుర్తుపై పోటీ చేసే అవకాశం కల్పిస్తేనే పార్టీకి పని చేస్తారా..? లేకుంటే పార్టీ కోసం పనిచేయరా? అనే సందేహాలు అభిమానుల్లో కలుగుతున్నాయి. టికెట్ ఎవరికి దక్కినా.. బూత్ స్థాయి నుంచి పార్టీ ప్రచారం, ఇతర బాధ్యతలను నెరవేరుస్తామని చెబుతున్నా అందులో నిజం ఎంత ఉంటుందోనని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ టికెట్ ఖరారు చేస్తే ప్రచారంలో దూసుకుపోతామని ఆశావహులు సైతం చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జంగ్ తెలంగాణ

ఎన్నికలను బహిష్కరిస్తున్నాం

మణుగూరుటౌన్: తమ గ్రామంలో 18 ఏళ్లుగా ఎక్కడి సమస్యలు అక్కడేఉన్నాయని, ఒక్కటి కూడా పరిష్కారానికి నోచుకోలేదని ఆరోపిస్తూ మండలంలోని బండారిగూడెం గ్రామస్తులు ఎన్ని కలను బహిష్కరిస్తున్నామని శనివారం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఓట్ల సమయంలోనే గుర్తిస్తూ హామీలు గుప్పిస్తూ పోతున్నారని, కొందరు వ్యాపారులు, గిరిజనేతరుల ప్రయోజనాల కోసమే తప్ప ఇక్కడ ఒరిగిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఏళ్లుగా పట్టించుకోని వారు నియోజకవర్గం బాగు చేస్తా మని చెబుతున్న మోసపూరిత మాటలు గమనించాలని, ఇలాంటి వాగ్దానాలు, హామీలను నమ్మి మోసపో వద్దని పేర్కొన్నారు. ప్రజలందరూ ఎన్నికల బహిష్కరణకు సిద్ధం కావాలని గ్రామపెద్ద బండారు శ్రీను పిలుపునిచ్చారు. కారం పుల్లయ్య, నర్సయ్య, కురసం కన్నయ్య, సోలం నర్సింహారావు, సోలం నాగేశ్వరరావు, బండారు చొక్కమ్మ, సోలం కుమారి, పద్మ, నాగరత్నమ్మ, కాంతయ్య, సుశీల, రమణమ్మ ఉన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర క్రికెట్ జట్టులో స్థానం



కుశాల్‌రెడ్డి

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధి రామవరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌కు చెందిన విద్యార్థి సీహెచ్ కుశాల్ రెడ్డి రాష్ట్ర క్రికెట్ జట్టులో స్థానం సంపాదించాడని పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ వై.సతీశ్ తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన సమావేశంలో సదరు విద్యార్థిని అభినందించిన సతీశ్ మాట్లాడారు. ఈ నెల 3వ తేదీన భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ బాలుర క్రికెట్ ఎంపికల్లో ఎస్ఆర్ ప్రైమ్ కొత్తగూడెం విద్యార్థి కుశాల్‌రెడ్డి ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని చెప్పారు. గద్వాల్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడని వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.క్రాంతికుమార్, పాఠశాల ఏఓ పీటర్, పీఈటీలు ఖదిర్, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఖో ఖో క్రీడలు ప్రారంభం

దమ్మపేట: మండల పరిధిలోని పార్కలగండి ఆశ్రమ పాఠశాలలో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఖోఖో సబ్ జూనియర్ క్రీడా పోటీలు ప్రారంభంకానున్నాయని ప్రిన్సిపాల్ ధర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు నేడు ఉదయం 9 గంటల్లోపు సంబంధిత ధ్రువ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 15 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు వీరే..

రఘునాథపాలెం: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఇటీవల జరిగిన పాఠశాల క్రీడల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్లలో కోయచలక పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ – 17 ట్రిపుల్ జంప్‌లో వై.పవన్ తేజ, సీహెచ్. ద్రాక్షాయని, అండర్ – 14 లాంగ్‌జంప్‌లో ఎం. రూప ఎంపిక కాగా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. శిరీష తదితరులు శనివారం అభినందించారు.

100 దేశాల్లో వందే విశ్వమాతరం యాత్ర



చిగురుమళ్ల శ్రీనివాస్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన కవి, రచయిత చిగురుమళ్ల శ్రీనివాస్ వందే విశ్వమాతరం పేరుతో 100 దేశాల సందర్శన యాత్రకు శ్రీకారం చుట్టినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న ఆఫ్రికా ఖండంలోని బోట్స్ వాన దేశంలో ఈ అపూర్వ యాత్ర ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 100 దేశాలలో విశ్వశాంతి, విశ్వమానవ సౌభ్రాతృత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి రక్షణ, మానవీయ విలువలు వంటి గొప్ప లక్ష్యాలతో ఈ యాత్ర కొనసాగుతున్నట్లు ఆయన వివరించారు. ఆయా దేశాలలోని ప్రవాస తెలుగు వారిని కలుస్తూ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తూ యాత్ర సాగించనున్నట్లు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

ఎన్నికల ప్రచారానికి వస్తే తన్ని తరమండి

ఆవుపల్లి – ఊసూరు మార్గంలో మావోయిస్టుల చేతిరాతలు



ఎన్నికలు బహిష్కరించాలని రాసిన మావోయిస్టులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఈ నెల 7న మొదటి విడత, 17న రెండో విడత ఎన్నికలు జరుగనుండగా ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ పలురూపాల్లో పిలుపునిస్తూ వస్తోంది. తాజాగా ప్రధాన రహదారిపై చేతిరాతతో ఎన్నికల ప్రచారానికి వచ్చే వారిని తన్ని తరమాలంటూ పిలుపునిచ్చింది. శనివారం బీజాపూర్ జిల్లాలోని ఆవుపల్లి – ఊసూరు ప్రధాన రహదారిపై సీతాపురం వద్ద గల ప్రధాన బీటీ రహదారిపై చాక్‌పీస్‌లతో చేతిరాతను రాసి ఎన్నికలను బహిష్కరించాలని, ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులను తన్ని తరమాలంటూ పిలుపునిచ్చింది. రహదారిపై మావోయిస్టుల రాతల సమాచారం తెలుసుకున్న ఆవులపల్లి, ఊసూరుకు చెందిన పోలీసు బలగాలు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని వాటిని చెరిపి వేశారు.

రెండో రోజు ఏడు నామినేషన్లు దాఖలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో శనివారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇల్లెందు నుంచి 2, కొత్తగూడెం నుంచి రెండు, పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఒక్కో నామినేషన్ దాఖలు చేశారు. దీంతో రెండు రోజుల్లో జిల్లాలో మొత్తం 10 నామినేషన్లు దాఖలయ్యాయి. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పాయం వెంకటేశ్వర్లు, ఇల్లెందులో కాంగ్రెస్ నుంచి కోరం కనకయ్య, భూక్య మంగీలాల్, కొత్తగూడెంలో బీఎస్పీ నుంచి ఎర్రా కామేష్, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి అవుతులపల్లి రామలింగేశ్వరరావు, భద్రాచలంలో స్వతంత్ర్య అభ్యర్థి పంద్రా హేమసుందర్ నామినేషన్లు దాఖలు చేశారు. అశ్వారావుపేటలో బీఆర్ఎస్ నుంచి మెచ్చా నాగేశ్వరరావు తరఫున దొడ్డా శ్రీరామమూర్తి నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబుకు సమర్పించారు.



ఇల్లెందు : నామినేషన్ దాఖలు చేస్తున్న కోరం కనకయ్య



మణుగూరు టౌన్: నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు



కొత్తగూడెంలో నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఎస్పీ అభ్యర్థి ఎర్రా కామేశ్



ఇల్లెందు : నామినేషన్ దాఖలు చేస్తున్న మంగీలాల్ నాయక్

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బి.మోహన్‌రావు రెండో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థుల దుస్తులు విప్పించి సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీసి బెదిరింపులకు పాల్పడినట్లు తల్లిదండ్రులు, గ్రామస్తులు గత నెల 30వ తేదీన ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. అనంతరం సదరు ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక పోలీసులు అదే రోజు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దీనిపై స్థానిక ఎంఈఓ పి.కృష్ణయ్య పూర్తిస్థాయి నివేదికను డీఈఓకు సమర్పించడంతో శనివారం సదరు ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేశారు.

నగదు సీజ్

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో రూ.లక్ష పట్టుబడింది. ఓ వాహనంలో రూ.లక్ష నగదు తరలిస్తుండగా పట్టుకున్నామని, వాహనదారుడు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

మండలపల్లి చెక్‌పోస్టు వద్ద...

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మండలంలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, మూడు వేర్వేరు కార్లలో రూ.2,15,500 నగదును గుర్తించారు. నగదుకు సంబంధించి, సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశామని ఎఫ్ఎస్ టీమ్ హెడ్ కృష్ణ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పినపాక: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ–బయ్యారం పంచాయతీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుంజా తిరుపతి (30) ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి సోదరి ఉమ ఫిర్యాదు మేర కు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్లు సీజ్



ములకలపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. మండలంలోని చాపరాలపల్లి, పకీర్‌తండా గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. శనివారం దాడులు నిర్వహించి, సుమారు రూ.18 వేల విలువగల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

అక్రమ కలప పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని కమలాపురం గ్రామంలో టాటా మ్యాజిక్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీశాఖ అధికారులు శనివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. టాటామ్యాజిక్‌లో కలప రవాణా చేస్తున్నారనే సమాచారంతో రేంజర్ కనకమ్మ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా.. అధికారులను చూసిన స్మగ్లర్లు ఆటోను అక్కడ వదిలేసి పారిపోయారు. ఆటోతో పాటు అందులో ఉన్న 14 టేకు దిమ్మెలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కలప విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అధికారులు తెలిపారు. తనిఖీల్లో డీఆర్వో శోభన్‌నాయక్, సిబ్బంది వెంకటరత్నం, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.